నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,25 సెప్టెంబర్ 2024

కార్పెంటర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

– దేవాదుల సూర్యనారాయణ మూర్తి

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : రెడీమేడ్ వేపకర్ర కిటికీలు గుమ్మాలు తలుపులు తయారు చేసి టింబర్ డిపోలలో అమ్మడం వల్ల కార్పెంటర్లకు, చేతి వృత్తిదారులకు పనిలేక జీవనోపాధి కోల్పోతున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా దుర్గా మల్లేశ్వర స్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘ జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పెంటర్లు అంబాజీపేట తహసీల్దార్ జె. వెంకటేశ్వరికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. భవన నిర్మాణ గృహోపకార వస్తువులపై ఆంక్షలు విధించాలన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల ఆమోదంతోనే కార్పెంటర్ వృత్తిదారులు మాత్రమే అమ్ముకునేలా ఏర్పాటు చేయాలని కోరారు. టింబర్ డిపోలలో రెడీమేడ్ వస్తువు తయారు చేయడం అరికట్టాలని, భవన నిర్మాణ కార్పెంటర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్పెంటర్లకు లేబర్ కార్డు ద్వారా కార్పొరేట్ వైద్యం అందించాలని తదితర సమస్యలపై తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పితాని బేబిరావు, గున్నేపల్లి భీమశంకర్, కేతా సోమేశ్వరరావు, కొవ్వూరు శ్రీనివాస్ రావు, యార్లడ్డ అరుణకుమార్, కొప్పిశెట్టి వేంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాకరపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభించిన మంత్రి దుర్గేష్

– ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే శేషారావు
– ఇకపై లాభసాటిగా వ్యవసాయం
– తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి లక్ష్యంగా
– వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన
– సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సూచన

పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ లాంఛనంగా ప్రారంభించారు. తదుపరి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో పురుగుల మందు పిచికారీ చేసే ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ అన్నదాతను ఆదుకోవడమే లక్ష్యంగా సాగులో పెట్టుబడులు తగ్గించి, పంటల దిగుబడిని, రైతన్న ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది అన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పంటను పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమ లక్ష్యాలు, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వస్తున్న సాంకేతిక పద్ధతులు, సాగులో మెలకువలు, పంట ఉత్పత్తులు, ఎరువులు, పంట తెగుళ్లపై అవగాహన కల్పించడం, రైతులను చైతన్య పరిచే కార్యక్రమాలు తదితర అంశాలపై అధికారులను అడిగి మంత్రివివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు కాకరపర్రులోని ఒక వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంతో పురుగుల మందు పిచికారీ చేసే ప్రదర్శన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సాగు వ్యయాన్ని తగ్గించడం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, మెరుగైన సాగు పద్ధతులు అవలంభించడం, రైతుల ఆదాయ స్థాయిని పెంచడం లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రెండురోజుల పాటు పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతన్నలకు వ్యవసాయానికి అయ్యే ఖర్చును తగ్గించి, దిగుబడి పెంచే విధంగా ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరించామన్నారు. రైతాంగం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో సాగులో ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించామన్నారు. మన వ్యవసాయానికి శాస్త్రీయంగా కొత్త విధానాలు ఏం వస్తున్నాయో తద్వారా పెట్టుబడులు తగ్గించుకోవడంఎలా, దిగుబడులు పెంచుకోవడం ఎలా అన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. రసాయనాలువినియోగిస్తే సాగు ఖర్చుఅధికమవుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ సాగు పద్ధతులపై రైతన్నలకు విజ్ఞానం కల్పించేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అందించిన సలహాలు, సూచనలు పాటిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు.

గత ఐదేళ్లలో వ్యవసాయ రంగం దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పొలం పిలుస్తోంది అనేమాటలేదని, వ్యవసాయానికి గిట్టుబాటులేకుండా చేశారని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు బూరుగుపల్లి శేషారావు, జిల్లా ప్రాజెక్టు అధికారి బితాతారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ సత్యకుమారి, మార్కెటింగ్ శాఖ అధికారి ఎన్.సునీల్, ఏడిఎ కొవ్వూరు పి.చంద్రశేఖర్, హార్టికల్చర్ ఆఫీసర్ కొవ్వూరు సిహెచ్ శ్రీనివాస్, ఉద్యానవన పరిశోధనల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.రవీంద్ర కుమార్, ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.నరసింహారావు, పెరవలి మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ వినయ్, తహసిల్దార్ అచ్యుత కుమారి, ఎంపీడీవో రమేష్, వెటర్నరీ ఎడి డాక్టర్ రిషి ప్రసాద్, పెరవలి పశు వైద్య అధికారి డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర, కాకరపర్రు ఆర్టికల్చర్ అసిస్టెంట్ హరిత, ఏవో, ఏఈఓ, సర్పంచి గుబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్,ఎంపీటీసీగుడాలరంగారావు, భూపతిరాజు రవివర్మ,అతికాల కృష్ణమ్మ, వాకలపూడి వీర్రాజు, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, కోటిపల్లి మురళీకృష్ణ, పొప్పుప్పు నాగేశ్వరరావు ,నందిప శ్రీనివాస చక్రవర్తి, సలాదిశ్రీహరి,ఎస్ నాగేశ్వరరావు, పెనుమత్స మధు, పాల సత్యవేరా స్వామి, తుల చినబాబు, పిప్పర రవి, సంగీత జయరాజు, సంగీత నాగు, ప్రసాదు, సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట, మేజర్ న్యూస్ : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందే అవకాశం ఉన్నందున అందరికి పోషకాహారం అందించే లక్ష్యంగా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పనిచేస్తుందని అంగన్వాడీ సూపెరవైజర్ మంగ అన్నారు. పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సామర్లకోట పట్టణం బ్రౌన్ పేట సెక్టార్ పరిధిలో పోషకాహారా మాసత్సవాల్లో భాగంగా పోషకాహార ప్రాధాన్యతపై అవహాగానా, పోషకాహార ప్రదర్శన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత సెక్టార్ పరిధిలో ఉన్న లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలు, తల్లులను సమావేశ పరచి వారికి పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. అలాగే పలురకాల కూరగాయలు, ఆకు కూరలను, తయారు చేసిన పోషకాహారాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలద్వారా అందిస్తున్న పోషకాహార వివరాలు, వ్యాది నిరోధక టీకాల అవసరం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సలహాలను సూపెరవైజర్ మంగ వివరించారు. అనంతరం పరిసర వీదుల్లో పోషకాహార ప్రాధాన్యత, స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై నినాదాలిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ లు ఎం.వి. శ్రీలక్ష్మి, ఎ.శ్యామల దేవి, ఎన్. శ్యామల కుమారి, టి.నాగమణి, శేషు, మాలతి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమము మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ప్రారంభించగా మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పర్యవేక్సించారు. ఈ శిభిరంలో వందమందికి పైబడి పారిశుధ్య కార్మికులు పాల్గొని వైద్య పరీక్షలు పొందారు. అలాగే ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను సుబ్రపరచి ప్రజారోగ్యానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, ఆసుపత్రి సూపరిండె ంటెంట్ డా.అమల, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ విద్యవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట, మేజర్‌న్యూస్ : ప్రభుత్వం వివిధ కారణాల వల్ల చదువు మానివేసిన విద్యార్థులు తమ చదువు కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్ ద్వారా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట మండల విద్యాశాఖ అధికారి1 & 2 వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్యలు, స్టేట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ, స్థానిక కోఆర్డినేటర్ తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. స్టేట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో ఉత్తీర్ణులైన వారికి రెగ్యులర్ విద్యార్థులు వలె ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28 వరకు సమయం ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రశాంతి, రామకృష్ణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవులో జాతీయ సేవా పథకం దినోత్సవ ర్యాలీ

అల్లవరం, మేజర్ న్యూస్ : స్థానిక బోనం వెంకట చలమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి వి యస్ ఏ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, ఆశయాలు, సమాజాభివృద్ధిలో ఆ సంస్థ యొక్క పాత్రను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు విద్యాసంపార్జనతోపాటు సమాజసేవలో కూడా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఓడలరేవు గ్రామంలో ప్లకార్డులు బ్యానర్లతో జాతీయ సేవా పథక దినోత్సవ ర్యాలీని చేసారు. ఈ.ఎస్.వి సుబ్రహ్మణ్యం, జి. లోవరాజు, శ్రీపాద రామకృష్ణ నిర్వహించిన ఈ ర్యాలీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులైన ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు పాల్గొనగా, కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణ సతీష్ వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.దుర్గామాధురి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రవీణ్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ బి.వి.రామన్, సీ.ఈ. ప్రొఫెసర్ బి. శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారిఏ.వై.ఆర్.వి. ప్రసాద్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బిల్లు కలెక్టర్ సూర్య మోహన్ మృతి

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : విధులు నిర్వహించేందుకు పంచాయతీ కార్యాలయానికి వస్తున్న బిల్లు కలెక్టర్ కు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మంగళవారం మృతి చెందాడు. స్థానికులు, పంచాయతీ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పెండ్యాల సూర్య మోహన్ (27) అమలాపురం రూరల్ భట్నవిల్లి తన ఇంటి వద్ద నుండి కార్యాలయానికి మోటారు సైకిల్ పై వస్తున్నాడన్నారు. ఈ సమయంలో గుండెపోటురావడంతో మోహన్ కుప్పకూలిపోవడంతో అతని బంధువులు అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మోహన్ మృతితో పుల్లేటికుర్రులోను, భట్నవిల్లిలోను విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్ మృతి పట్ల సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీలు వడలి కృష్ణమూర్తి, కుసుమ వెంకటేష్, పబ్బినీడి రాంబాబు, పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షులు ఆర్.ఎస్.ఎస్. సూర పురాజు, కార్యదర్శి ఎం.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కానూరు స్వగృహానికి వచ్చిన అమెరికాలో మరణించిన కానూరు యువకుడి మృతదేహం

– నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన చిలుకూరి శ్రీరాఘవ దొర అను 24 సంవత్సరాల వ్యక్తి అమెరికాలో అకాల మరణం చెందిన విషయం తెలుసుకుని అమెరికాలో స్థిరపడ్డ కానూరు గ్రామానికి చెందిన యువకులు తానా సభ్యుల సహకారంతో బాడీని సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం ఉదయం కానూరు గ్రామంలో ఆయన స్వగృఎ ఈనికి అంబులెన్స్ ద్వారా తీసుకువచ్చారు. మృతదేహం చూడటంతో మృతుని తల్లి మణి, సోదరుడు వంశీలు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. వారిని ఆపడం ఎవరి వల్ల కాలేదు. ఈ వార్త తెలుసుకున్న నిడదవోలు మాజీ శాసనసభ్యులు తెదేపా ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు కానూరు వచ్చి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని తండ్రి కూడా చిన్న వయసులో గుండెపోటుతో మరణించిన సంగతిని గుర్తుకు తెచ్చుకుని బంధువులు, గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. దీంతో కానూరు గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. టెక్సాస్ స్టేట్ దల్లాస్ నందు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెస్ పూర్తి చేసుకుని కానూరు స్వగృహానికి రావాల్సి ఉందని అయితే ఉద్యోగ అన్వేషణలో ఉండటం వల్ల కోర్స్ అయిన వెంటనే రాలేకపోయాడని, ఇలా జరుగుతుందనిఊహించలేదని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

పర్యావరణ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

– డాక్టర్ బిఈవిఎల్ నాయుడు
– ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా చివరి రోజు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో చదువుతోపాటు సమాజ సేవకు ప్రాధాన్యత ఇస్తామని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రోజువారి కార్యక్రమాలతోపాటు ప్రత్యేక కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నారని అన్నారు. సమాజ సేవ కోసం కొంత సమయాన్ని కేటాయించడానికి ఎన్ఎస్ఎస్‌లో చేరిన వాలంటీర్లు అందర్నీ మరియు వారిని నడిపిస్తూ వారికి సారథ్యం వహిస్తున్న ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, దివాకర్ రావు మరియు గౌరీ ప్రియ లను, ఎన్ఎస్ఎస్ విద్యార్థి నాయకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజ సేవ ద్వారా వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

సామర్లకోట, మేజర్ న్యూస్ : ప్రజల వద్దనుంచి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటుపడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ నాయకులు విత్తనాలు వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి వందరోజులు ముగిసిన సందర్భంగా ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, ప్రజలనుంచి సమస్యలు స్వీకరిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు పనులతో పాటు వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందాన్నారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో రహదారులు పరిస్థితి దయనీయంగా మారగా వాటి నిర్మాణానికి ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇంకా ప్రజలకున్న అన్ని రకాల సమస్యలు పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల అధికారులను హాజరు పరుస్తూ తక్షణమే వాటి పరిస్కారానికి ఆదేశాలు జారీచేస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇంకా కార్యక్రమం లో బీజేపీ నాయకులు వెంకటరమణ, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నూకరత్నం, తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి, ఎంపిడివో డి శ్రీలలిత, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, మండల విద్యాశాఖధికారి వై.శివరామ కృష్ణయ్య, తెదేపా మండల అధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబు, గుమ్మళ్ళ రామకృష్ణ, ముసిరెడ్డి శ్రీరాములు, శ్రీపతి అప్పారావు, చీకట్ల వెంకటేష్, కుర్రా రాజు, జనసేన నాయకురాలు పెంకే వెంకటలక్ష్మి, ఆకునూరి సత్తిబాబు, ముమ్మిడి సూరిబాబు, సరోజ వాసు, నాగబాబు, బుచ్చిరాజు మండల పరిధిలోని కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గూడాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

అల్లవరం, మేజర్ న్యూస్ : గూడాల గ్రామంలో సర్పంచ్ దాకారపు చిరంజీవి రావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరవేయడం, వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. రైతులందరూ వరి పంటలో సస్యరక్షణ కొరకు డ్రోన్‌లు ఉపయోగించాలని కోరారు. డ్రోన్‌లు ఉపయోగించడం వలన సమయం ఆదా చేయుట మరియు ఖర్చులను తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని తెలియజేశారు.

జిల్లావ్యాప్తంగా 1,57,900 ఎకరాల్లో వరి సాగు జరగగా, 1,56,446 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయింది, అందులో 1,32,900 ఎకరాలకు రైతుల ఈకే వై సి పూర్తయినట్టు తెలియజేశారు. పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ లు కట్టుకోవడానికి పథకం అమలులో ఉంది అన్నారు. కావున రైతులు సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్.వి. సత్యనారాయణ, మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని అశ్విని సత్య, ఉప సర్పంచ్ పోలిశెట్టి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ సభ్యులు పంపి రెడ్డి కాశి, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి శివ మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు రంజిత్ స్వామి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హేమలత, పాటి సింహద్రి, రైతులు పోలిశెట్టి భాస్కరరావు, పోలిశెట్టి కృష్ణ సాయి, బొలిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, మేడిది పద్మనాభం మొదలగువారు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో మహా అన్నదానం

గొల్లప్రోలు,మేజర్న్యూస్ : గొల్లప్రోలు పట్టణ పరిధి రంగప్ప చెరువు వీధిలో మంగళవారం గణపతి నవరాత్రులను పురస్కరించుకొని గణపతి మండపం ఉత్సవ కమిటీ సభ్యులు మహానధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుండి విచ్చేసినటువంటి అశేష భక్తజనానికి స్వామివారి అన్న ప్రసాదం అందించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమానికి ఘనంగా విరాళాలు అందించిన జనసేన పార్టీ నాయకులు బస్సా చిట్టిబాబు, సిద్ధ వారి కుటుంబ సభ్యులు విరివిగా విరాళాలు అందించి మహానదన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి యావన్మంది భక్తులు విచ్చేసి మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంచాయితీ పరిధిలోని టెండర్ కార్మికుల ఉద్యోగ భద్రతపై మంత్రికి వినతి పత్రం

పెరవలి, మేజర్ న్యూస్ : పంచాయతీలలో పని చేసే టెండర్ కార్మికుల ఉద్యోగ భద్రతకై వేతనాలు పంచాయతీ ఫండ్ నుండి కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని పిఎఫ్ ఈఎస్ఐ చెల్లించాలని, టెండర్ విధానం రద్దు చేయాలని డిమాండ్లతో సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం పెరవలి మండలంలోని పంచాయతీ టెండర్ కార్మికులు రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ టెండర్ కార్మికులు గేదెల శివన్నారాయణ, కొమ్మిశెట్టి శ్రీనివాస్, దాసం ఆదినారాయణ మూర్తి, సజ్జ కార్తీక్, ఖండవల్లి రాము, మల్లు బాలకృష్ణ, మల్లిపూడి సత్యనారాయణ, కొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నల్లి రాజు, వెలుబూడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాకరపర్రులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

- పాల్గొన్న మంత్రి దుర్గేష్ మాజీ ఎమ్మెల్యే శేషారావు
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది
- సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళు

పెరవలి, మేజర్ న్యూస్ : సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన సాగిందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని మంత్రి కందులు దుర్గేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తమ ప్రభుత్వం 100 రోజుల ప్రగతిని తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ సంక్షేమాన్ని అందిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల చేత అనిపించుకుంటుందని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు తీర్చడానికి సిద్ధంగా ఉందని అన్నారు. త్వరలోనే టిడ్కో ఇల్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపిస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెరవలి మండలానికి 12 కోట్ల రూపాయల ఎన్ఆర్ జిఎస్ నిధులతో సిమెంట్ రోడ్లు మంజూరు చేస్తామని ఆయన గుర్తు చేశారు. రాబోయే ఐదేళ్లలో ప్రజల బాగోగులు చూస్తామని ప్రజా సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు. ప్రజలంతా మంచి మనసుతో అమృత హస్తాలతో కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. నిడదవోలు టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గురుకుల శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సామాజిక పద్ధతి పెన్షన్లను పెంచిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం 2000 నుండి 3000 కి పెన్షన్ పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంటే కూటం ప్రభుత్వం కేవలం 15 రోజుల్లోనే పెన్షన్ 4000 కు పెంచి ప్రజలకు ఒకటవ తేదీనే గుమ్మం వద్ద అందించింది అన్నారు అంతేకాక ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పెంచిన పెన్షన్ జూలైలో ప్రజలకు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రాతలకు పట్టిన అన్నం పెట్టే అన్న క్యాంటీన్ పునరుద్ధరించామని తద్వారా పేద ప్రజలు కడుపు నింపుతున్నామన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో పని చేస్తున్నాము అన్నారు. ఈ సభలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ కు స్థానికులు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. వాటి అన్నింటినీ ఓపిగ్గా చదివిన మంత్రి దుర్గేష్ పరిష్కారానికి తప్పనిసరిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలిసారి కాకరపాడు గ్రామానికి అధికార పర్యటన నిమిత్తం వచ్చిన మంత్రి దుర్గేష్‌ను గ్రామంలోని పలు సంఘాలు పూలమాలలతో ఘనంగా సత్కరించాయి.ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాజీ ఎమ్మెల్యే శేషారావుతోపాటు పెరవలి మండల స్పెషల్ ఆఫీసర్ సునీల్ వినయ్, ఎమ్మార్వో డి.అచ్చుత్ కుమారి, ఎంపీడీవో ఎస్.రమేష్, సర్పంచ్ గొబ్బల ఆదిలక్ష్మి శ్రీనివాస్, ఎంపీటీసీ గుడాల రంగారావు, జిల్లా ఉద్యాన అధికారిని బి.సుజాత కుమారి, ఉద్యాన పరిశోధన స్థానం కొవ్వూరు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.రవీంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడిఏ పి.చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అతికాల శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంగీత జయరాజ్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పిప్పర రవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంగీత నాగు, తుల చినబాబు, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, కూటమి పార్టీల నాయకులు అధికారులు అనధికారులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల ప్రత్యేక గ్రామ సభ

అల్లవరం,మేజర్న్యూస్:అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయము నందు గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది ఈ సభలో గత సంవత్సరంలో మన గ్రామంలో చేసినటువంటి పనులను గ్రామసభ ద్వారా ప్రజలకు వివరించడం జరిగింది ఉపాధి హామీ పథకంలో జాబు కార్డు పొందిన ప్రతికూలి 100 రోజు పని దినాలను ఉపయోగించుకోవడంతోపాటు పనిచేసేటప్పుడు హెల్త్ డిపార్ట్మెంట్ నుండి ఇచ్చేటటువంటి ఫస్ట్ ఎయిడ్ కిట్లను మెట్లు దగ్గర ఉంచుకుని ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలని గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం జేఈ అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ బొంతు శ్యాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దర్గా శ్రీను, పాలకవర్గ సభ్యులు అడపా శ్రీను, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు చింతా శ్రీను, ఓలేటి పరమేశ్వరరావు, పొట్టు పోతు పోచమ్మ, బస్వాని హేమలావతి, అయిల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధాకృష్ణ, రొక్కల నాగేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, హెల్త్ డిపార్ట్మెంట్ వారు ఉపాదా మీ పథకం కూలీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరపలో 'ఇది మంచి ప్రభుత్వం'

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలన పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన ప్రారంభమైన కార్యక్రమం 26న ముగుస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం కాకినాడ రూరల్ నియోజవర్గంకు సంబంధించి మండల కేంద్రం కరపలో చిరంజీవి కళ్యాణ మండప ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రూరల్ టిడిపి కో కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీల నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి టిడిపి,జనసేన క్యాడర్ హాజరయ్యారు.ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు.కరపత్రాలు పంపిణీ చేసారు. అనంతరం కార్యదర్శి సునీల్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చేయాల్సిన పనుల గురించి వివరించారు. కూటమి ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు.రెండు పార్టీల నాయకులు పిల్లి ఆనంతలక్ష్మి సత్తిబాబు,నులుకుర్తి వెంకటేశ్వరరావు, బండారు మురళీ, బోగిరెడ్డి గంగాధర్, ముద్రగడ రమేష్, జిల్లెళ్ళ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం మరియు జంతు శాస్త్ర ఆధ్వర్యంలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. రత్న మాణిక్యం తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యతోపాటు సేవా దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొనుట వల్ల వ్యక్తిత్వ వికాసంతోపాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ తమ గ్రామంలో జరిగిన గతకాలపు ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులు చేసిన సేవా కార్యక్రమాలు తెలుపుతూ, విద్యార్థులు ఎలాంటి ధన సహాయం లేకుండా ప్రజలకు ఉచిత సేవ చేయడం తన హృదయాన్ని ఆకర్షించిందన్నారు.కళాశాల సీనియర్ అధ్యాపకులు జి. వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్. సేవా కార్యక్రమాలు చేయడంలో పోటీ పడాలన్నారు. ఆంగ్ల అధ్యాపకులు ఆర్.సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక ప్రవర్తన, నిజాయితీ, సేవా దృక్పథకం అలవాటు చేసుకోవాలన్నారు.వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి. హారతి మాట్లాడుతూ సమాజ సేవా కూడా విద్యలో భాగమేనన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం యొక్క చిహ్నం మరియు లక్ష్యాలను వివరించారు.అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.వై. పద్మ, కె. శకుంతల, ఎస్. అప్పనమ్మ, కె.శైలజ, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఎన్.రమేష్, ఆర్.మౌనిక, పి.అలివేలు, ప్రకాష్, శ్రీనివాస్, సుభద్ర మరియు అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన జి.అగ్రహారం విద్యార్థులు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల టెబుల్ టెన్నీస్ పోటీల్లో గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్కు చెందిన విద్యార్థులకు తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు హెచ్ఎం జి.శ్రీహరిరాజశేఖర్ తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో విజయవాడ పడమట స్టేడియంలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుండి మట్టపర్తి గ్రీష్మశ్రీ, ఇల్ల మనోజ్ఞనాగ దీప్తి, దంగేటి విద్యా సాయిశ్రీలకు కాంస్య పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు పొందారన్నారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను, పీడీ ఆసు శేషవెంకట సూర్యమధులను సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, విత్తనాల ఇంద్రశేఖర్, పీఎంసీ చైర్మన్ తొత్తరమూడి గోవిందరావు, బందన రాంబాబు, మట్టపర్తి చంద్రశేఖర్, ఎం.ఎం.శెట్టి, రాయుడు కృష్ణమహేష్, రాయుడు షన్ముఖ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నేడు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణి

- డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.సరిత

పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్ : జాతీయ నులు పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 25వ తేది బుధవారం ఆల్‌బెండజోల్ పంపిణీ కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలని, కాకినాడ జిల్లా డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.పి.సరిత వైద్య సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట ్లాడుతూ నులుపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం ఏర్పడుతుందన్నారు. ఆల్‌బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. 25వ తేదిన 1 నుంచి 19 ఏళ్ళ లోపు కిశోర బాలికలకు ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని, తల్లితండ్రులు ఈ విషయం గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా తమ పిల్లలు మాత్రలు తీసుకునేలా చూడాలని ఆమె అన్నారు. జిల్లా పరిధిలోని ఇంకా ఎంఓపి ఆఫ్‌డే (మాప్ ఆఫ్‌డే) కార్యక్రమంలో భాగంగా ఇంకా 36,444 మంది మాత్రలు వేయవలసి ఉందని, ఆమె తెలిపారు. కావున వైద్య సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజిలు, ఇళ్ళ వద్దకు వెళ్ళి మిగిలిన వార్కి ఈ మాత్రలు పంపిణీ చేయాలని ఆమె సూచించారు.

జెఎన్టీయుకెలో ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్టియుకె ప్రాంగణంలో మంగళవారం యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ప్రిన్సిపాల్ ఆఫీస్ సెమినార్ హాలు నందు జెఎన్టియుకె ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యుసిఇకె యూనిట్-2, యూనిట్-3ల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయగా యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.జి.శ్యామ్‌కుమార్ గౌరవ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం కూడా విద్యలో ఒక భాగమన్నారు. విద్యతో పాటు ఎన్ఎస్ఎస్ కూడా ముఖ్యమని, ఎన్ఎస్ఎస్‌ను ఆచరణాత్మక విద్యగా భావించాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలోని సమస్యలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించేందుకు ఎన్ఎస్ఎస్ ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. మొత్తం ఇంజనీరింగ్, ఫార్మశీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా విధిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను సమాజంలోకి బాధ్యతగా తీసుకువెళ్లేది ఎన్ఎస్ఎస్ మాత్రమేనన్నారు. సామాజిక బాధ్యత అనేది విద్యార్థి జీవితంలో భాగం కావాలని, విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన, బాధ్యత ఉన్నప్పుడే జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారన్నారు. సమాజానికి సాంకేతికపరంగా ఉపయోగపడడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ విద్యార్థులపై ఉందన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా 10కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు కె.రమణాజీ, ఎంవిఎస్‌వి.కిరణ్మయి, డా.పి.వీరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా సామూహిక సీమంతాలు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, మేజర్ న్యూస్ : సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి 30వ తేదీ దాకా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మరియు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు హాజరై మహిళలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓశ్రీలక్ష్మి,సూపర్వైజర్‌లక్ష్మి, సరోజినీ,అంగన్వాడీలు పాల్గొన్నారు.

రాజమండ్రి డివిజన్ అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : రాజమండ్రి డివిజన్ అంగన్వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని రెవెన్యూ డివిజన్ అధికారి కేఎస్ శివ జ్యోతి తెలియజేశారు. మంగళవారం ఉదయం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూ వివరాలను ఆర్డిఓ వివరిస్తూ రాజమండ్రి అర్బన్ కోరుకొండ రంగంపేట రాజానగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్వాడి టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. మూడు అంగన్వాడీ వర్కర్ల పోస్టు కోసం 15 మంది, 33 అంగన్వాడి హెల్పర్ల పోస్టులకు 93 మంది, ఒక మినీ అంగన్వాడీ కేంద్రం వర్కర్ పోస్టుకు ఇద్దరు హాజరైనట్లు తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె విజయ కుమారి వివరాలు తెలుపుతూ రాజమండ్రి కొవ్వూరు డివిజన్ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఖాళీ వివరణ అంగన్వాడి కేంద్రాల పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించడం జరిగిందన్నారు ఇందులో భాగంగా మంగళవారం రాజముండ్రి పరిధిలో ఇంటర్వ్యూలు చేపట్టడం జరిగింది అన్నారు, గురువారం కొవ్వూరు డివిజన్ పరిధిలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో అధ్యక్షతన కమిటి సభ్యులు కన్వినియర్ జిల్లా ఐసిడిఎస్ అధికారి కే.విజయ్ కుమారి, డిప్యూటీ మర్చిపో డాక్టర్ సుధాకర్, సంబంధిత సిడిపివోలు హాజరయ్యారు.

గోరింటలో పాలం పిలుస్తోంది కార్యక్రమం

పెద్దాపురం, రూరల్, మేజర్న్యూస్ : వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు బుధవారం పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ పచ్చిపాల నేరీకుమారి అధ్యక్షతన రామాలయం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల వలన వరిలో పంట తెగుళ్ళు, చీడపీడలు గురించి రైతులకు అవగాహన కల్పించి, వాటి నివారణకు సూచనలు చేశారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం, రైతులకు ఎలా తయారుచేసుకోవాలో వివరించి, విషపు ఎరను రైతులకు పంపిణీ చేశారు. పశు వైద్యురాలు డా.మస్తాన్ బీ మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్‌లో పశువులకు వ్యాధులకు సంబంధించి టీకాలు వేయడం జరుగుతుందని, అదే విధంగా ప్రతీ రైతు పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 వి.ఆర్.కె. చౌదరి, వ్యవసాయ మార్కెట్ కమిటి ఇన్‌చార్జి సెక్రటరీ టి.శ్రీదేవి, ఉద్యాన సహాయకులు ఎం.సత్యనారాయణ, ఎఇఓ ఎన్.వి.వి.ప్రసాద్, వ్యవసాయ సహాయకులు సాహితి, శ్రీవాణి,అఖిల్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది బంగారు శేషుబాబు, కోన వీరవెంకట రమణ, కోటేశ్వరరావు, కోన రామకృష్ణ, కర్రి వీరభద్రరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో అక్రమ ఇసుక సీజ్

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : బొబ్బర్లంకలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను మంగళవారం రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ అధికారులు సీజ్ చేశారు.

బొబ్బర్లంక సమీపంలో వశిష్ట గోదావరిని ఆనుకుని అక్రమంగా ఇసుక నిల్వ చేశారని సమాచారం అందడంతో తాసిల్దార్ టీ.రాజేశ్వరరావు ఆదేశాలతో మండల రెవిన్యూ ఇనస్పెక్టరు భవాని బొబ్బర్లంక వీఆర్వో, గ్రామ కార్యదర్శిలు దాడులు చేసి వశిష్ట గోదావరికి ఆనుకుని వున్న ఇసుక డంప్ సీజ్ చేశారు. సుమారు నాలుగు యూనిట్ల ఇసుకను సీజ్ చేసి బొబ్బర్లంక ఇరిగేషన్ కార్యాలయంకు తరలించారు. సీజ్ చేసిన ఇసుకను బొబ్బర్లంక పంచాయతీ కార్యదర్శి కి అప్పగించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం

కాకినాడ, మేజర్ న్యూస్ : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం స్థానిక ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణ అంశాలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్ విష్ణు, ట్రాఫిక్ సిఐలు ఎన్.రమేష్, డి.రామారావులు పాల్గొని రహదారి భద్రత, పౌరుల భాధ్యత గురించి విద్యార్థులకు వివరించారు. సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించవలసిన ఆవశ్యకత, హెల్మెట్ ధరించిన వ్యక్తులు గతంలో జరిగిన పలు ప్రమాదాలలో ప్రాణహాని లేకుండా సురక్షితంగా బయట పడిన ఉదంతాలను దృశ్య ప్రెజెంటేషన్లతో విశదపరిచారు. అలాగే హెల్మెట్ ధారణ తప్పనిసరిచేస్తూ అమలులోకి వచ్చిన నిబంధనలు, ఉల్లంఘించిన వారు ఎదుర్కోనే జరిమానాలు, శిక్షలు తదితర అంశాల గురించి తెలియజేసి విద్యార్థులు తమతో పాటు వారి తల్లిదండ్రులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారు కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించేలా చూడాలని కోరారు. ఈ నెల 21వ తేదీ నుండి ఇప్పటి వరకూ కాకినాడ నగరం, రూరల్ పరిధిలోని మూడు కళాశాల్లోను, నగరంలోని ప్రధాన కూడళ్లు భానుగుడి జంక్షన్, మసీదు సెంటర్, బలరాం సెంటర్లలో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో ఈ అవగాహన, జనచైతన్య కార్యక్రమాలను నిర్వహించి ప్రమాదాల నివారణలో ప్రజా సహకారాన్ని కోరారు. డంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు - మంగళవారం కాకినాడ నగరంలో నిర్వహించిన వాహన తనిఖీలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి కోర్టుకు హజరు పరిచామని ట్రాఫిక్ సిఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలియజేశారు. వీరిలో 9 మందికి ఒక్కక్కరికీ 2 రోజుల జైలు శిక్ష, 10వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ తనిఖీలు నిత్యం కొనసాగుతాయని వారు తెలియజేశారు.

భవిత కేంద్రంను పరిశీలించిన ఎంఈఓ వి.ఆర్.కె.చౌదరి

పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మా గాంధి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో సమగ్ర శిక్షా ద్వారా నడపబడుతున్న భవిత కేంద్రంలో మంగళవారం పెద్దాపురం మండల విద్యాశాఖాధికారి-2 వి.ఆర్.కె.చౌదరి ఫిజియోథెరపి సేవలను పరిశీలించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపి కేంద్రంలో ప్రతీ మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని భవిత పిల్లల తల్లితండ్రులుఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఓ తెలిపారు. మండలంలోని శారీరక వైకల్యం, మెదడు పక్షవాతం గల దివ్యాంగ పిల్లలకు ఈ భవిత కేంద్రంలో ప్రతీ మంగళవారం జరిగే ఫిజియోథెరపి సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలనిన్నారు.ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపిస్ట్ వి.అపర్ణ, భవిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఏఈగా అశోక్

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఆత్రేయపురం ఎలక్ట్రికల్ ఏఈగా టి అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గోకవరం నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు ఇప్పటివ రకు పనిచేసిన బాపిరాజు రాజమహే ంద్రవరం డి వన్ సెక్షన్‌కి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలక్ట్రికల్ కు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూస్తానన్నారు.

ఏళ్లుగా ఎదురుచూస్తున్న బొబ్బర్లంక బ్రిడ్జిపై రోడ్డుకు మోక్షం

- ఎమ్మెల్యే సత్యానందరావు చొరవతో రహదారి నిర్మాణానికి నిధులు

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : కొత్తపేట నియోజకవర్గం ప్రజలే కాకుండా ఉభయగోదావరి జిల్లాల ప్రజలు కూడా ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు ఎదురుచూస్తున్న బొబ్బర్లంక బ్రిడ్జిపై మాత్రమే నిలిచిపోయిన రహదారికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవతో మోక్షం కలిగింది.కొత్తపేటఎమ్మెల్యేగాగెలిచిన వందరోజుల్లోనే ఏళ్ల నాటి నుంచి ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికుల ఇక్కట్లు తీర్చే విధంగా కృషి చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. అభివృద్ధి అంటే అందరికంటే ఒక అడుగు ముందుండే సత్యానందరావు ఈ రహదారికి 35 లక్షల రూపాయల నిధులు సాధించి మంగళవారం పనులకు శంకుస్థాపన చేశారు.

జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారి కష్టాలను తొలగించాలనే లక్ష్యంతో ముందుకు సాగి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశానని అన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా ఎన్నోసార్లు ఈ రోడ్డు

నిర్మించాలని నిరసనలు ఆందోళనలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నియోజకవర్గ అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి జనవరి ఆరవ తారీఖున రోడ్డు నిర్మాణం అంటూ కొబ్బరికాయ కొట్టి, ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసి ప్రయాణికులను మోసం చేశారని విమర్శించారు.

నాపై నమ్మకంతో గెలిపించిన వారికోసం చేసిన కృషి ఫలించిందని ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం వంద రోజుల్లోనే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న ఈ రోడ్డును నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ఇదే కాకుండా నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్న రోడ్లన్నీ త్వరలోనే నిర్మించి అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తానని సత్యానందరావు తెలిపారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ,నాయకులు చిలువూరిసతీష్‌రాజు, నరాల శెట్టి సుబ్బలక్ష్మి వెంకన్న, జల్లికామేశ్వర రావు, కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాధం, జాన వీరఆంజనేయులు, జుజవారపు హరిబాబు, సిద్ధంశెట్టి సత్యనారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జి.రాగంపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

- పాల్గొన్న టిడిపి నాయకులు

పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం జి.రాగం పేటలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పల ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ) మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి పార్టీ అధికారంలోకి వచ్చి వంద రోజులు అయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీలలో భాగంగా టీచర్ పోస్టుల భర్తీలు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, రూ.4వేలు పెన్షన్, వికలాంగులకు రూ.6వేలు పెన్షన్, అన్నా క్యాంటిన్‌లు నిర్వహణలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందని బాబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టిడిపి నాయకులు దేవళ్ళ వరప్రసాద్ (బోస్), బిజెపి నాయకులు మోటుకూరి వీరబాబు, హౌసింగ్ సిబ్బంది ఈశ్వరుడు, ఇంజనీరింగ్ సిబ్బంది జగదీష్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ విజయాలపై ప్రజలకు వివరించారు.

ఎస్‌పిని కలసిన వైద్యుల సంఘం ప్రతినిధులు

- దాడి ఘటనపై వెంటనే ఎఫ్ఐఆర్ వేయాలని వినతి

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం, కాకినాడ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం రాత్రి కాకినాడ జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను కలిసారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు మరో 60 మంది కలిసి రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగాది పతి డాక్టర్ ఉమామహేశ్వరరావుపాటు అక్కడ ఉన్న మరికొందరు వైద్య విద్యార్థులపై దాడి చేసి కొట్టారని దీనిపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ వేయలేదని వారు ఎస్‌పి దృష్టికి తీసుకువచ్చారు. సంఘం ప్రతినిధులు డాక్టర్ వీరయ్య, మనోహర్ ఆధ్వర్యంలో పదిమంది ప్రతినిధుల బృందం ఎస్‌పి ని కలిసింది. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఎఫ్ఐఆర్ వేస్తామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చినట్లు డాక్టర్ వీరయ్య వెల్లడించారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి

కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలో గృహ నిర్మాణాలకు సంబంధించి గ్రౌండింగ్ పనులు పూర్తి చేయడంతోపాటు స్లాబ్ లెవల్, స్లాబ్ వేసిన గృహాలను రానున్న అక్టోబర్ చివరి నాటికి వినియోగంలోకి తీసుకురా వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. హౌసింగ్, జిల్లా ప్రజా పరిషత్, డ్వామా, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, సమగ్ర శిక్ష, ఏపీఈడబ్ల్యూఐడీసీ, డీఆర్డీఏ శాఖల అధికారులు, పిఠాపురం, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి మండలాల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గృహ నిర్మాణాల గ్రౌండింగ్ పనులు, 2014-19 కాలంలో ఎన్టీఆర్ గృహాల సర్వే, ఉపాధి హామీ పథకం పని దినాలు, క్లోరినేషన్ ప్రక్రియ, మధ్యాహ్నం భోజనం నాణ్యత తనిఖి, సంక్షేమ, వసతి గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ సమావేశంలో చర్చించి ప్రస్తుత పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. పునాది, బేస్మెంట్ లెవల్ లో ఉన్న గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రధానంగా స్లాబ్ లెవెల్ ఉన్నా, స్లాబ్ వేసిన గృహాలను అక్టోబర్ చివరి నాటికి మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా 2014-19 మధ్యకాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు మధ్యలో బిల్లులు ఆగిపోయిన వాటికి సచివాలయం స్థాయిలో సర్వే నిర్వహించి, యాప్ లో వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. తక్కువ పురోగతి కనబపరుస్తున్నా మండలాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వీలైనన్ని పనిదినాలు జనరేట్ అయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ మున్సిపల్ ప్రాంతాలతో పాటు సంక్షేమ వసతి గృహాలు గురుకుల పాఠశాలలోని మంచినీటి ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియను అక్టోబర్ 15 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. సోమ, గురువారాలలో తప్పనిసరిగా సచివాలయం సిబ్బంది తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్నా మధ్యాహ్న భోజనం నాణ్యత తనిఖి చేసి క్రమంగా నివేదిక పంపించాలన్నారు. సంక్షేమ వసతి గురుకుల పాఠశాలలో ఆరో ప్లాంట్స్ ఏర్పాటుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్వీవి సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ వెంకట రమణ రాజు, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, జేడ్పీ ఇన్చార్జి సీఈఓ పి.నారాయణ మూర్తి, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లిఖార్జున రావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, పిఠాపురం, గొల్లప్రోలు, యూ.కొత్తపల్లి మండలాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రామచంద్రపురం పట్టణం పాత బస్ స్టాండ్ వద్ద ప్రతీ నెల 4వ మంగళవారం సుఖీభవ చారిట్రబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి, పేదలకు బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ప్రతీ ఒక్కరూ పోషకాహారం తీసుకొని, వ్యక్తిగత శుభ్రతతో బాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈ నెల 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ద్వారా పరిశుభ్రతపై ప్రజలకు అవగహన కల్పిస్తున్నారని డాక్టర్ చప్పిడి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేదునూరి శేషగిరి, వాసంశెట్టి వీర వెంకటరమణ, ఈతా ప్రసాద్, గుండుపల్లి రామకృష్ణ, నేదునూరి శ్రీనివాసరావు, నక్క చంద్రరావు, కొయ్య బంగారుబాబు, జగ్గంపూడి కృష్ణ, యాండ్ర బుల్లబ్బులు, దూళిపూడి ప్రభాకర్‌రావు, దండుబోయిన త్రిమూర్తులు, సూర్య ప్రకాష్‌లు పాల్గొన్నారు.

సాధారణ బదిలీలలో పలువురు అధికారులు, సిబ్బంది చేరిక

పెద్దాపురం, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పురపాలక సంఘంలో ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా పలువురు అధికారులు, సిబ్బంది విధులలో చేరినట్లు మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. మున్సిపల్ టిపిఓగా సిహెచ్.ఫణికుమార్, బి.ఆదినారాయణ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, సీనియర్ అసిస్టెంట్లుగా ఎ.వీర్రాజు, డి.వెంకటలక్ష్మి, జి.గంగాధర రామారావు, ఎస్.శ్రీహరి శ్రీనివాస్, టి.వి.నాగమణి, సీనియర్ అకౌంటెంట్‌గా డి.సుభాషిణి, జూనియర్ అసిస్టెంట్లుగా కె.రాజీవ్, ఎస్.వి.ఆర్.విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్‌గా వి.మహేష్, మెప్మా సిఓగా ఎండి.మహబూబ్ ఉన్నిసా, మెప్మా డిఇఓగా కె.శ్వేతశ్రీ విధులలో చేరినట్లు మున్సిపల్ కమీషనర్ తెలిపారు.

వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన

కాజులూరు/కాకినాడ, మేజర్ న్యూస్ : వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన అందించి ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అంటున్నారని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న ఇది మంచి ప్రభుత్వమని 40 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ చరిత్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్రాన్ని సంక్షేమ అభివృద్ధి పథంలోకి తీసుకువెళుతున్నారని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం! ఎందుకంటే సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి 100 రోజుల్లోనే 'ఇది మంచి ప్రభుత్వం!' అని ప్రజలతో అనిపించుకుంటోందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు వివరాలు తెలియజేసే కరపత్రాల పంపిణీ, స్టిక్కర్లు అంటించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మాటలకే పరిమితం కాకుండా ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేదిశగా అడుగులు వేస్తూ ప్రజా సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. అందులో భాగంగా మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీని చేపట్టి నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతున్న ప్రభుత్యం అన్నారు. పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 5 రూపాయలతోనే ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలకు నిద్ర లేకుండా చేసిన "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్"ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4 వేలు ఇస్తున్నామని తెలిపారు. మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే ఒక తిరుగులేని సంక్షేమ చరిత్ర అన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని అన్నారు. రూ.1674.47 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిలను చెల్లించి అన్నదాతను కూటమి ప్రభుత్వం ఆదుకుందన్నారు. స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోసిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమే అని కార్మిక శాఖ మంత్రి సుభాష్ తెలిపారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంకు సంబంధించిన గోడపత్రికను, పంప్లేట్‌లు, స్టిక్కర్లు మంత్రి వాసంశెట్టి సుభాష్ లాంచింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాజులూరు ఎంఆర్ఓ శివకుమార్, ఎంపీడీవో శర్మ, గొల్లపాలెం గ్రామ సర్పంచ్ ప్రసన్న మౌనిక, జనసేన పార్టీ అధ్యక్షులు కాజులూరు సతీష్, ఎన్డీఏ కార్యకర్తలు గుబ్బలయేసు రాజు, గుత్తుల రాజు, గండి కిషోర్, చుండ్రు వీరచౌదరి, రామారావు, అంగర కృష్ణ, కాశి, బాబి, వివిధ శాఖల సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీహార్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పద మృతి

కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి : బతుకుతెరువు కోసం బీహార్ రాష్ట్రం నుంచి కాకినాడ రూరల్ కరప మండలానికి వచ్చిన మదన్ మోహన్ సాహిని అనే 36 ఏళ్ల వ్యక్తి అనుమానాస్పద మృతి చెం దాడు. కరప పోలీసుల కథనం ప్రకారం కరప పెనుగుదురు మధ్య మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభించింది. కరప ఎస్ఐ మూర్తి బృందం అక్కడికి వెళ్లారు. మృతుదేహాన్ని పరిశీలిం చారు. గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి చనిపోయి ఉండవచ్చని భావిస్తున్నారు. అతని వద్ద గాలించగా ఆధార్ కార్డు లభించింది. అందులో అతని పేరు మదన్ కుమార్ సాహినిగా గుర్తించారు. బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్‌కు చెందిన వ్యక్తిగా ఆ కార్డులో ఉంది. గత కొంతకాలంగా జిల్లాలో బీహార్‌కు చెందినవారు చేపల చెరువులు, రొయ్యల చెరువుల్లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఆధార్ కార్డు ఆధారంగా జిల్లాలో పనిచేస్తున్న బీహారీలను కలిసి ఇతని ఆచూకీ తెలిసిన ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్ఐ మూర్తి తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం కాకినాడ ప్రభుత్వాసు పత్రి మార్చురీకి తరలించారు. ఈ మృతుని వివరాలు తెలిసిన వారు కరప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

కూటమి నాయకులు హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి ప్రసాదం అయిన లడ్డూను గత వైసీపీ ప్రభుత్వం జంతు అవశేషాలు కలపడంతో, హిందువుల మనోభావాలు దెబ్బతిందని కలియుగ వైకుంఠంలా అలరారుతున్న, సాక్షాత్ శ్రీమహావిష్ణువే కొలువుదీరిన తిరుమలపై, అక్కడి పవిత్రతపై, స్వామివారి లడ్డూ ప్రసాదంపై వివాదం చెలరేగడం, కోట్లాదిమంది హిందువులు, శ్రీవారి భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడం దీనిని ఖండిస్తు పట్టణంలో నిరసన బైక్ ర్యాలీ జరిగింది. బైక్ ర్యాలీ తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నుండి బయలుదేరి హౌసింగ్ బోర్డ్ వెంకటేశ్వరస్వామి కి వినతిపత్రం సమర్పించి అక్కడి నుండి మార్కెట్ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద గోపూజ నిర్వహించి స్వామివారికి వినతిపత్రం సమర్పించారు. అక్కడినుండి డీఎస్పీ ఆఫీస్ అక్కడి నుండి ఆర్డిఓ ఆఫీస్‌కు వెళ్లి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ గారికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావు, జనసేన నాయకులు నారపరెడ్డి బలరాం, సత్యవాడ శ్రీహరి పంతులు బిజెపి నాయకులు కార్యకర్తలు మరియు హిందూ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టినా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం గడిచిన వంద రోజుల్లో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ నగరంలోని 27, 28 29, 31, 32, 34 డివిజన్లకు సంబంధించి "ఇది మంచి ప్రభుత్వం" ప్రజా వేదికగా కార్యక్రమం స్థానిక సినిమా రోడ్‌లోని అన్నదాన సమాజంలో జరిగింది. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల సొమ్మును పెంచి ఒకటో తారీఖున అందజేశామన్నారు అలాగే కాకినాడ నగరంలో సుమారు ఐదు అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు పేదల కడుపు నింపే ప్రయత్నం చేశామని ఆయన వెల్లడించారు.

గృహ నిర్మాణదారులకు ఉచిత ఇసుక అందజేస్తామని తెలిపారు. అలాగే వచ్చే దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని తెలిపారు. గతంలో పోలీస్ స్టేషన్కు వెళ్లేందుకు ప్రజలు భయపడే వారని, కానీ నేడు నేరుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సమస్యలు చెప్పుకునే స్వేచ్ఛ వచ్చిందన్నారు. కాకినాడ నగరంలో గంజాయి అరికట్టే చర్యలు చేపడతామని తెలిపారు. అధికారులు ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పేలా ఈ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే వనమాడి తెలిపారు. ప్రజలు నేరుగా అధికారులకు ఫోన్లు చేసి సమస్యలు తెలియజేయవచ్చని వెల్లడించారు. గత ప్రభుత్వం తిరుపతి లడ్డును కూడా అపవిత్రం చేసిందని తెలిపారు. టిడ్కో గృహ లబ్ధిదారులను జగన్ సర్కారు దారుణంగా మోసం చేసిందని ఇల్లు ఇవ్వకపోయినా వాయిదాలు కట్టిస్తోందని తెలిపారు. కాకినాడ నగర ప్రజలకు నగరానికి దూరంగా ఉన్న కొమరగిరి లేఔట్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అవి నిర్మాణానికి అనుకూలంగా లేవని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసు బాబు, మేనేజర్ సత్యనారాయణ, టిపిఆర్ఓ శైలజ, మెప్మాసిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, శానిటరీ సూపర్వైజర్ రాంబాబు, ఇతర భాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్.ఎస్.ఎస్. డే

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సంజీవ్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్ నందు, కలశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ డి భువన్ కుమార్ ఎన్.ఎస్.ఎస్. జెండాను ఆవిష్కరించి ఎన్.ఎస్.ఎస్. డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విద్యార్థినులు "స్వచ్ఛ సంకల్ప ప్రతిజ్ఞ" చేసి పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలి నిర్వహించారు. విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత సమాజం నిర్మించాలని, మానవ జీవితంలో పచ్చదనం యొక్క ప్రముఖతను ఎన్.ఎస్.ఎస్. సమన్వయ కర్తలు మిస్టర్ అవిస్ అగస్టిన్, ఎన్ మణికంఠ వివరించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి దాని పర్యవేక్షించాలని కలశాల అకడమిక్ డైరెక్టర్ డా. రవివర్మ సూచించి విద్యార్థులతో కలశాల ప్రాంగణంలో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమములో ఏఓ పి.శ్రీనివాస్, అకడమిక్ ఇంచార్జి టి.కనకలక్ష్మి మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ల ఆందోళనకు వైద్య సిబ్బంది మద్దతు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ అలవెన్సులు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న డాక్టర్లకు వైద్య సిబ్బంది సంఘీభావం ప్రకటించారు. రంపచోడవరం మండలం నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వీస్ లో ఉన్న డాక్టర్ లకు పీజీ ఇన్ సర్వీస్ కోటా ప్రభుత్వం తగ్గించి వారికి అన్యాయం చేసి నందు వల్ల, వారికి తిరిగి పూర్వపు పద్ధతి లోనే కోటా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారికి వైద్యశాఖలోని ఫీల్డ్ సిబ్బంది ఓపీ సిబ్బంది మద్దతుగా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారి సమ్మె కు సంఘీభావం తెలుపుతున్నామని నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పేర్కొన్నారు.

శ్రీవారి ప్రసాద లడ్డూ పవిత్రతను కాపాడాలి

అంబాజీపేట, మేజర్ న్యూస్ : తిరుమల తిరుపతి శ్రీవారి ప్రసాద లడ్డూ యొక్క పవిత్రతను కాపాడాలని గోవిందానామాలతో శాంతియుత నిరసన తెలిపారు. అంబాజీపేట సెంటర్‌లో హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది మంది భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామివారి దర్శించుకుంటారని కలియుగదైవం తిరుమల తిరుపతి శ్రీ వారి ప్రసాద లడ్డూ భక్తులకు ఎంతో భక్తితో కొలుస్తారని అన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా నాణ్యత లేని నెయ్యితో తయారు చేసేందుకు ఉపక్రమించినవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని నినాదాలు చేసారు. ఎంతో భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకొనే భక్తులకు నాణ్యత ప్రమాణాలతో ప్రసాద లడ్డూని అందించాలని కోరారు. అంతకుముందు గోవింద నామాలను ఆలపిస్తూ నాలుగు రోడ్లు ర్యాలీగా వెళ్ళారు. ఈ కార్యక్రమంలో హిందుపరిరక్షణ సమితి సభ్యులు, శ్రీవారి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఏజెన్సీ పర్యాటక ప్రదేశాల్లో జాగ్రత్తలు పాటించాలి

– ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం,మేజర్న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని,దీనికి సంబంధితశాఖలఅధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో అన్ని మండలాల తాసిల్దార్లు, ఎంపీడీవోలు, పర్యాటక శాఖ, అటవీశాఖ అధికారులు, అలాగే వివిధ శాఖల ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పర్యాటక ప్రాంతాలు చూసేందుకు వచ్చిన పర్యాటకులకు ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకునే విధంగా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్ప శ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాల్లో టూరిస్టులు తిలకించే జలపాతాలు వద్ద ప్రమాదాలు జరగకుండా పర్యాటకుల ప్రాణాలు రక్షించే విధంగా రక్షణ చర్యలు ఎక్కడ ఏర్పాటు చేయవలసి ఉంది గుర్తించి తాసిల్దార్లు, ఎంపీడీవోలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో కమిటీలు ఏర్పాటు చేసి నివేదికలు సమర్పించాలని ప్రాజెక్టు అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం, ఆదివారం ఏజెన్సీ ప్రాంతానికి పర్యాటకులు ఎక్కువగా రావడం జరుగుతుందని, అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినవారికిఎక్కడికక్కడ కేసులు నమోదు చేసి, రూ.500లు తక్కువ కాకుండాజరిమానా విధించాలని పోలీసులను ఆయన ఆదేశించారు.పర్యాటక ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షించాలన్నారు. పర్యటక ప్రాంతాలలో టూరిస్టులు కాలువలలో దిగకుండా ఇనుప కంచె వేసే విధంగా నివేదికలు తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. పర్యటక ప్రాంతాలలో కొంతమంది టూరిస్టులు ఫోటోలు తీసుకొనుటకు కాలువ

లలో దిగుతున్నారని, అదేవిధంగా కాలువలో దిగి ఫోటోలు తీసుకొనుటకు అనుమతించవద్దని, అదేవిధంగా ఎవరైనా ఫోటోగ్రాఫర్లు టూరిసులను కాలువలో దిగిన వారిని ఫోటోలు తీస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు కొండ కాలువలు ఎక్కువగా పొంగుతున్నప్పుడు ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కాలువలపై నడిచి రాకపోకలు నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. మైదాన ప్రాంతాల నుండి ఏజెన్సీలో పర్యటక ప్రాంతాలకు వచ్చే టూరిస్టులు కొండ కాలువలలో దిగకుండా సుమారు 50, 60 మీటర్ల దూరం నుండి తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పర్యాటక ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించే విధంగా ఐటీడీఏ నుండి డస్ట్ బిన్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఎక్కడెక్కడ ఏమి ఏర్పాటు చేయాలో కమిటీలు నివేదికలు సమర్పించాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయాలని సంబంధిత అధికారులను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో నీరు నిల్వ చేసే ప్రాజెక్టులు దిగువకు నీరు వదిలినప్పుడు సైరన్ ఉపయోగించాలని ఆయన అన్నారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలలో తిలకించే ప్రాంతాలు, అక్కడ పరిస్థితులపై టూరిస్టులకు ముందు జాగ్రత్తలు కొరకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే టూరిస్టులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసేవారిని గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు.

పర్యాటక ప్రాంతాలకు వచ్చే టూరిస్టులు ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, అటవీ శాఖ సబ్ డిఎఫ్ఓ.బి.శ్రీరాములురావు, పర్యాటకశాఖఅసిస్టెంట్ మేనేజర్ ఆర్.రంగబాబు, జి.యస్.వి. సత్యనారాయణ, సి.హెచ్.శ్రీని వాసరావు, డివిజనల్ పంచాయతీ అధికారి అబ్బులు, తాసిల్దార్ లు కృష్ణ జ్యోతి, సిహెచ్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, అనసూయ, సుబ్రహ్మణ్య చారి, డిప్యూటీ తాసిల్దార్లు రామకృష్ణ, బాలాజీ, బి.రాజు, పిఓపిఆర్ అండ్ ఆర్ డి జాన్ విల్టన్, ఎంపీడీవోలు యాదగిరిశ్వరరావు, పి.జయంతి, ఆర్ అండ్ బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సతీష్, అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ రంపచోడవరం సబ్ ఇన్స్పెక్టర్ మోహన్ రావు, ఐటీడీఏ ఎస్ఓ మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్, ఆడాని అధికారులతో అంగన్వాడీ యూనియన్ చర్చలు విఫలం

కాకినాడ, మేజర్ న్యూస్ : అంగన్వాడి యూనియన్ ప్రతినిధులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు, అదాని అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రావతి ప్రకటించారు. అంగన్వాడీ విధులలోకి ఆడాని వాలంటీర్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ 26వ తేదీ తలపెట్టిన కలెక్టరేట్ భారీ ధర్నా యధావిధిగా కొనసాగుతుందని తెలియజేశారు.వివరాల్లోకి వెళితే అదానీ పరిశ్రమలు ఉన్న 15 కిలోమీటర్ల పరిధిలోని అంగన్వాడీ సెంటర్లలో ఆడాని నియమించిన వాలంటీర్లతో పని చేయించేందుకు ప్రయత్నించడాన్ని అంగన్వాడీ సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిడి కె.ప్రవీణ యూనియన్ ప్రతినిధులు, ఆడాని అధికారులతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే అంగన్వాడీ నిర్వహించే విధులనే అదానీ వాలంటరీలతో కూడా చేయిస్తామని తెలపడంతో తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సమావేశం నుండి బయటకు రావడం జరిగిందని తెలిపారు. ఈ ఉమ్మడి సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ, జిల్లా కోశాధికారి జి.రమణమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వీరవేణి, జ్యోతి, ఎస్తర్ రాణి, ధనలక్ష్మి, సుజాత, మేరి సమాధానం, వీర మణి, తులసి, కాకినాడ రూరల్ నాయకులు రాజేశ్వరి, వరలక్ష్మి, భవాని తదితరులు ఉన్నారు.

డ్రెయిన్ మార్గం ఏర్పాటు చేయాలని ఫిర్యాదు

అల్లవరం, మేజర్ న్యూస్ : అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో ఓఎన్‌జిసి 30 సంవత్సరాల నుండి కార్యకలాపాలు సాగిస్తుంది. 8 సంవత్సరాల క్రితం 350 ఎకరాలు చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. సముద్రానికి గ్రామాలకి మధ్యలో వైఎన్‌జిసి ఏర్పాటు చేయడం వలన వర్షాలు కురవడం వలన నీరు దిగే మార్గం లేకపోవడం వలన నీరు నిలిచి దోమలు విపరీతంగా పెరగడం వలన ఐదుగురు చనిపోయారని, కొబ్బరి చెట్లు చనిపోయాయని, బెండమూరి లంక శివరా రెబ్బన్న పల్లి దగ్గర పంప్ హౌస్ నిర్మించారు. దాల్వపంటలు లో పంటకాలవ నీరు వైఎన్‌జిసి తోడటంవల్ల తోడటం వలన పంట పొలాలకి సాగు నీరు అందకపోవటం వల్ల పంట నష్టం జరుగుతుంది. సమస్యలు సకాలంలో పరిష్కరించి రైతులు మురుగు డ్రెయిన్ తవ్వకాలు చెయ్యాలని గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదులు చేశారు. కోల సహదేవుడు, బాబులు, మల్లాడి ఉమామహేశ్వరావు, మల్లాడి భాను, సొల్లంగి రాధాకృష్ణ, మధుర కుమార్ స్వామి, రేవు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో పొలం పిలుస్తుంది రా కార్యక్రమం



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది రా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి పి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో రైతులకు వరి పంటలపై అవగాహన కల్పించారు.అనంతరం వ్యవసాయ అనుబంధ శాఖలు ఆధ్వర్యంలో వరి పొలాలను సందర్శించి రైతులకుసస్య రక్షణలపై అవగాహన కల్పించారు.రసాయన ఎరువులు వాడకం తగ్గించి,జీవన ఎరువుల వాడకంపై అవగాహన, పొలంలో ప్రకృతి వ్యవసాయం, పశువుల ఎరువు, పచ్చి రొట్ట ఎరువులు వాడకం పెంచాలని, భూ పరీక్షలు చేయించుకోవాలని, ఈ పంట నమోదుపై చర్చించి, సున్నా వడ్డీ, పంట రుణాలు, పంట బీమా, పెట్టుబడి సాయం, గిరిజన రైతులకు 90% సబ్సిడీ పై డిఫిరిగేషన్ పైపులు రిజిస్ట్రేషన్ పై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తాము సూరిబాబు, పశు వైద్య అధికారి తరుణ్ కుమార్, మత్య శాఖ జె.సత్యవతి, ఉద్యాన శాఖ సీతారామరాజు, కే.ప్రదీప్ కుమార్, రైతులు ఉన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కాగడాలతో ర్యాలీ

అన్నవరం, మేజర్ న్యూస్ : తిరుమల వెంకటేశ్వరస్వామివారి లడ్డు ప్రసాదంలో వాడే నెయ్యిలో గత వైసీపీ ప్రభుత్వంలో జంతు అవశేషాలు కలిసాయని జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిరసనగా 11 రోజులపాటు ప్రాయశ్చిత్త దీక్ష చేపడుతున్న సందర్భంగా ఆ దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇంచార్జ్ వరుపులు తమ్మయ్య బాబు అన్నవరం సత్యనారాయణస్వామివారి పాదాల చెంత కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేసి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు ఆలయాల శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. కొండ దిగువ స్వామివారి తొలి పావంచాల వద్ద కాగడాలు వెలిగించి కాగడాలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని, ఇటువంటివారిని ఎవ్వరూ క్షమించకూడదని, తిరుమల పవిత్రతను అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వరుపుల తమ్మయ్య బాబు తోపాటు బండారు రామారావు, వరుపుల సాయి కిరణ్, దాశం శేషారావు, పెంటకోట మోహన్, నల్లల రామకృష్ణ, కరణం సుబ్రహ్మణ్యం, తుమ్మల సత్యేంద్ర, గాబు సుభాష్, నవుడు నూకరాజు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలియజేశారు.

అన్నవరప్పాడు వెంకన్న ఆలయంలో వివాహ మండపాల పాట

పెరవలి,మేజర్న్యూస్:తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబరు జాతీయ రహదారి ప్రక్కన వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సెప్టెంబర్ 24వ తేదీ మంగళవారం దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు వివాహ మండపాలు వేసుకునే హక్కుకుగాను జరిగిన వేలంపాటలో సాలు ఒక్కఇంటికి రూ.3,55,000లకు అన్నవరప్పాడు వాస్తవ్యులు ఆచంట శివకుమార్ హెచ్చు పాటదారుడై పాట పాడుకుని ఉన్నారు అని వెంకన్న ఆలయ కార్యనిర్వాహణ అధికారి మీసాల రాధాకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి పి.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణ అధికారిగా పాల్గొనగా గ్రామస్తులు, పాటదారులు సమక్షంలో వేలం పాట నిర్వహించడం జరిగినది. సదరు వేలంపాట గత పాట కంటే 50 వేల రూపాయలు అదనంగా సమకూరినది అని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ తెలియజేశారు.

పెరవలి మండలం ఏపీఎంగా బండారు రామకృష్ణ

పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఏపియం గా బండారు రామకృష్ణ జూలై 24వ తేదీ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. బండారు రామకృష్ణకు గతంలో పెరవలి ఏపీఎంగా పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటివరకు ఇక్కడ ఏపియం గా పనిచేసిన నాగరాజు బదిలీపై పెంటపాడు మండలం ఏపియంగా వెళ్లారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అత్రేయపురం,మేజర్న్యూస్:కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి మంగళవారం రావుల పాలెంకు చెందిన కటారి రంగరాజు రూ.1,05,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ చక్రధర్‌రావు,సిబ్బందిస్వామివారిచిత్రపటం అందించారు.

మరిడమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్‌గా కె.విజయలక్ష్మీ

పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ : పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్‌గా కె.విజయలక్ష్మీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ముందుగా మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈమెకు వేదపండితుల ఆధ్వర్యంలో స్వాగతం పలికి వేదాశీర్వచనాలు అందజేశారు. ఈమె మందపల్లి దేవస్థానం నుంచి అసిస్టెంట్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా ఇక్కడకు రావడం జరిగింది. ఇప్పటివరకు ఇక్కడ అసిస్టెంట్ కమీషనర్‌గా విధులు నిర్వహించిన చేబ్రోలు రామ మోహనరావు సాధారణ బదిలీలలో భాగంగా అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్‌గా వెళ్ళారు.

సంక్షోభంలో సంక్షేమ,అభివృద్ధికి రెక్కలు

– మిరియాల శిరీష దేవి, విజయ భాస్కర్

ఎటపాక, మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వంలో సంక్షోభంలో సంక్షేమ, అభివృద్ధికి రెక్కలు వచ్చాయని రంపచోడవరం నియోజవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి,విజయ భాస్కర్ అన్నారు.ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో నెల్లిపాక సర్పంచ్ కుర్సభద్రం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నెల్లిపాక సెంటర్ నందు గల స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి స్థానిక నాయకుల ప్రజా ప్రతినిధులతో కలిసి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మిరియాల శిరీష దేవి, విజయ భాస్కర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రజలకు అందించిన పాలనకు వందనం చెప్పక తప్పదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ వంద రోజుల్లో సాధించిన సంక్షేమ మరియు అభివృద్ధి గురించి తెలపడం జరిగింది. మొదటిగా 3,000 పెన్షన్ ని 4,000గా చేసి ముందుగా ఇస్తానన్న మూడు నెలల పెన్షన్ ని కలిపి ఒకేసారి 7,000 రూపాయలు ఇచ్చి దేశ చరిత్రలోనే ఇది మొదటిసారి గా నిలిచారని, మెగా డియస్సి 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రజల కంటికి నిద్ర లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం, స్థానిక సంస్థలకు 1,452 కోట్లు నిధులు మంజూరు చేసి నిర్వీర్యం అయిన పంచాయతీలకు తిరిగి ప్రాణం పోశారని, ఉపముఖ్యమంత్రి పవన్కళ్యాణ్ రాష్ట్రంలో ఉన్న అన్ని పంచాయితీలను ఒక తాటి మీదకు తెచ్చి ఒకే సారి గ్రామ సభ నిర్వహించి రికార్డ్ సృష్టించారని, 5రూపాయలకే అన్నం పెట్టే 100 అన్నకాంటిన్లు ప్రారంభించారు అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం పరిశీలకులు చల్లబోయిన శ్రీనివాస్, నియోజవర్గ తెలుగు యువత నాయకులు మఠం విజయ భాస్కర్, వైస్ ఎంపీపీ దొంతుమంగేశ్వరరావు,జనసేన మండల అధ్యక్షులు మాదాసు గంగాధర్, టిడిపి సీనియర్ నాయకులు పాటి చలపతిరావు, నెల్లిపాక గ్రామ కమిటీ అధ్యక్షులు ఏలూరి వెంకన్న, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, ముంపు మండలాల క్లస్టర్ ఇంచార్జి మాచినేని రాజేష్, మాజీ తెలుగు యువత నాయకులు నలజాల శ్రీకాంత్, మాజీ సొసైటీ డైరెక్టర్ కిలారి వెంకటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా నాయకులు పాటి సంపత్ కుమార్, ఐటీడీపీ ఛాంపియన్ బాచినేని శ్రీకాంత్ మరియు టీడీపీ నాయకులు, ఎటపాక తహసీల్దార్ పృథ్వి, వెలుగు ఏపిఎం స్వామి, ఎటపాక సీఐ ఎం.కన్నప్ప రాజు, ఎటపాక ఎస్సై పార్థసారథి, నెల్లిపాక గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రత్యూష్, టీడీపీ నాయకులు నలజాల మధు, గోడేటి రవి కుమార్, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్ రావు ఆధ్వర్యంలో స్వచ్ఛత పై అవగాహన ర్యాలీ

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో ఎనిమిదవ రోజు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు వాటర్ ట్యాంక్ లోపలకు దిగి దగ్గరుండి పారిశుధ్య కార్మికులచే వాటర్ ట్యాంక్ ను హైక్లోరైడ్ బ్లీచింగ్ తో శుభ్రపరచడమైనది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు హసన్ బాద చేనేత శ్రామికుల పెద్దలు దొంతంశెట్టి సత్యాప్రకాష్ ఆధ్వర్యంలో చేనేత శ్రామికులచే స్వచ్ఛత గురుంచి ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ ప్రజల సమక్షంలో సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీ ఆధ్వర్యంలో ట్యాంక్ వాటర్ ను పరీక్షించడం జరిగింది. అదేవిధింగా ఆరోగ్య సిబ్బంది నిధియ పారిశుధ్య కార్మికులకు వారి వ్యక్తిగత భద్రత గురించి, ఆరోగ్యపరంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురుంచి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇక నుండి పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడంలో గ్రామ ప్రజలకు మరింత సేవలు అందిస్తారని,ఎవ్వరూ కూడా బయట గాని, డ్రైనేజీలలో గాని ఏవిధమైన చెత్తను వేయరాదని కోరారు.పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా వార్డ్ సభ్యులు గ్రామస్థుల సమక్షంలో వారి వేతనాన్ని పెంచాలని సర్పంచ్ నిర్ణయం చేసారు.అనంతరం చేనేత శ్రామికులు వారి పెద్దలతో కలిసి సర్పంచ్,సచివాలయం సిబ్బంది గ్రామ వీధులలో స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ భాస్కర లక్ష్మి, వి.ఆర్.ఓ సూర్య కుమారి, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సచివాలయం, పంచాయితీ, రెవిన్యూ సిబ్బంది,వార్డ్ సభ్యులు జి.పల్లపు పద్మరాజు, సి.ఎచ్.పాండు రంగారావు, విద్యా కమిటీ చైర్మన్ జాన మల్లిబాబు, గ్రామ చేనేత పెద్దలు, చేనేత శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

– మిరియాల శిరీష దేవి, విజయ భాస్కర్

ఎటపాక, మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పెద్దపీట వేశారని రంపచోడవరం నియోజవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి విజయ భాస్కర్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో, గ్రామ కమిటీ అధ్యక్షులు చేకూరి వెంకట రమేష్ అధ్యక్షతన గ్రామసభ ను మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి హాజరు అయ్యారు. ముందుగా పురుషోత్తపట్నం గ్రామంలో ఏర్పాటుచేసిన నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ ఆవిష్కరించడం జరిగింది. అనంతరం నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసిన వాళ్ళు అర్పించారు. సందర్భంగా మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ఒక మహనీయుడని, అలాంటి నాయకుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం పూర్వజన్మలు చేసిన పుణ్యమని ఆమె అన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని,కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధాప్య పెన్షన్ పెంపు, మెగా డీఎస్సీ, 100 అన్న క్యాంటిన్‌లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఇలా ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రజలకు అందించడం జరిగిందని,మిగిలి ఉన్న హామీలన్నీ త్వరలోనే అమలు చేయడం జరుగుతుందని,అలాగే రోడ్ల నిర్మాణం, వీధిలైట్లు, డ్రైనేజీ నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. స్థానిక నాయకులు ముంపు మండలాల ప్రజల కష్టాలను, వరదల సమయంలో వారు పడుతున్న ఇబ్బందులను ఆమెకు ఎవరిని చేయడం జరిగింది. వెంటనే స్పందించి ముంపు మండలాల ప్రజల పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు చల్ల బోయిన శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ భాస్కర్, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు విజ్జగిరి రవి తేజ, ఎటపాక వైస్ ఎంపీపీ దొంతూ మంగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు మరదాసు గంగాధర